క్లుప్తంగా

మరమ్మతులకు నోచుకోని రహదారి



అధ్వానంగా గురుద్వార్ నుంచి ఏపీఈపీడీసీఎల్‌కు వెళ్లే రహదారి

సీతమ్మధార: జీవీఎంసీ పరిధి 14 వార్డులోని ఏపీఈపీడీసీఎల్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. గురుద్వార్ నుంచి ఏపీఈపీడీసీఎల్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు ఒక వైపు పూర్తిగా మరమ్మతులకు గురవడంతో రాత్రి పూట వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

నేడు వైభవుడికి తులసీదళార్చన

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆషాఢ శుద్ధఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. 9గంటలకు శ్రీవారికి తులసీ దళార్చన ఉంటుందన్నారు. 10గంటలకు సామూహిక విష్ణు సహస్ర పారాయణం ఉంటుందన్నారు.

ఎమ్మెల్యేతో దేవదాయ శాఖ ఏసీ భేటీ



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు జ్ఞాపిక అందజేస్తున్న శిరీష

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును సీతమ్మధార బాలయ్యశాస్త్రిలేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో దేవదాయధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను అర్చకులు రామారావు శర్మ ఆశీర్వదించి, ప్రసాదం అందజేశారు. అనంతరం సత్కరించారు. కొద్ది సేపు ఎమ్మెల్యేతో ఏసీ శిరీష వివిధ అంశాలపై చర్చించారు.

ఉచితంగా కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు అందజేస్తున్న కార్పొరేటర్ ముక్కా శ్రావణి

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి ఆధ్వర్యంలో శాంతిపురంలో గల కార్పొరేటర్ కార్యాలయంలో ఉచితంగా కళ్లద్దాల పంపిణీ చేశారు. జిమ్‌సర్, గీతం హాస్పిటల్ సంయుక్తంగా ఇటీవల వార్డులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటిచూపు సరిగా లేని వారిని గుర్తించి వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. చికిత్స చేయించుకున్న వారికి మంగళవారం ఉదయం కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై సదస్సు నేడు

ఉక్కునగరం: స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహిస్తున్నారు. 'సంక్షోభంలో విశాఖ ఉక్కు – పరిష్కారం ఎలా ' అనే అంశంపై సాయంత్రం 5.30 గంటలకు ఉక్కు ఎల్‌డీసీ ఆడిటోరియంలో సదస్సు ప్రారంభం కానుంది. స్టీల్‌ప్లాంట్ పూర్వ సీఎండీ వై.శివసాగరరావు, సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు జె.డి.లక్ష్మీనారాయణ, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు సదస్సులో పాల్గొనున్నారు. సదస్సుకు ఉద్యోగులందరూ హాజరు కావాలని సీఐటీయూ నాయకులు జె.అయోధ్య రామ్, యు.రామస్వామి కోరారు.



అక్రమ పార్కింగ్‌తో అవస్థలు

- తుప్పుపట్టిన వాహనాలను తరలించాలి
- చీకటి పడితే మరింత ఇబ్బందులు
- ట్రాఫిక్ పోలీసుల స్పందన కరువు



కంచరపాలేంకు వెళ్లే రహదారిపై వాహనాల మరమ్మతులు



జ్ఞానాపురానికి వెళ్లే రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు

కంచరపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని భారీ వాహనాల అక్రమ పార్కింగ్‌తో వాహనదారులు, స్థానిక ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన, అంతర్గ రహదారులపై భారీ లారీలు, ట్రావెల్ బస్సులు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు నరకయాతన పడుతున్నారు. తాటిచెట్లపాలెం కూడలి నుంచి కంచరపాలెంకు, ఇటు కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ నుంచి జ్ఞానాపురానికి వెళ్లే రహదారుల్లో వాహనాలను నిలుపుతుండడంతో వాహనదారులు, పాదచారులు అసౌకర్యానికి గురవుతున్నారు. రెండేసి వరుసల్లో వాహనాలు నిలిపి మరమ్మతులు చేపడుతున్నారు. నెలలు తరబడి రోడ్లపై వాహనాలు నిలపడంతో చెత్తచెదారాలు, మట్టి గుట్టలుగా పేరుకుపోతున్నాయి. దీంతో శానిటరీ సిబ్బంది వాటిని ఊడ్చే పనులు వదులుకున్నారు. ఇరుకురోడ్లపై వాహనాలు నిలిపే కారణంగా కొన్నిసార్లు ప్రమాదాల బారిన కూడా పడుతున్నారు. కంచరపాలెం ఫ్లైఓవర్ మార్గంలో ఎఫ్‌సీఐ గిడ్డంగికి వచ్చే లారీలు ఎక్కడ పడితే అక్కడ నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. నిషిద్ధ సమయాల్లో భారీ వాహనాల రాకపోకలకు అడ్డూ



కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ బీఆర్‌టీఎస్ రహదారిలో వాహనాల అక్రమ పార్కింగ్

లేకుండా పోతోంది. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ట్రాఫిక్ పోలీసులు వ్యవహరిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి వాహనాలు తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని వాహనదారులు, పాదచారులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రయాణం నరకం

కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలెం మీదుగా నగరానికి వెళ్లాలంటేనే ఆందోళనగా ఉంది. నిత్యం భారీ వాహనాలు రహదారికి ఇరువైపులా నిలిపివేస్తుండడంతో వాహనా రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది.
–చెంగల రామారావు, కంచరపాలెం

ఏళ్ల తరబడి ఉన్న వాహనాలు తరలించాలి

రహదారికి ఇరువైపులా ఏళ్ల తరబడి నిలిపి ఉంచిన వాహనాలను తరలిస్తే అటుగా ప్రయాణం చేసే వాహనాలకు ఇబ్బందులు ఉండవు. ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి రహదారిపై వాహనాలు తరలించాలి.
–కె కమలాకర్, జ్ఞానాపురం

జోనల్ అధికారులు స్పందించాలి

జోన్–5 పరిధిలో రహదారులు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వాహనాలు పార్కింగ్, వాహన మరమ్మతులు చేపడుతున్నా జోన్–5 టౌన్‌ప్లానింగ్ అధికారులు దృష్టి సారించడం లేదు. ప్రజా సమస్య వేదికలో ఫిర్యాదులు చేసిన స్పందన కరువవుతోంది. ప్రమాదాలు జరిగితే అధికారులు, పోలీసులు హడావుడి చేస్తున్నారు తప్ప అక్రమ పార్కింగ్ వాహనాలను తరలించడం లేదు.
–పి.అప్పలరాజు, ఊర్వశికూడలి

రహదారి పనులు పరిశీలన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న రహదారి పనులను మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల లీలావతి శ్రీనివాస్ పరిశీలించారు. రైల్వేన్యూకాలనీ, జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ వీధిలో నూతనంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తున్నారు. రూ.20లక్షల నిధులతో చేపట్టిన ఈ పనులను ఆళ్ల శ్రీనివాస్ పరిశీలించారు.



రైల్వేన్యూకాలనీలో రహదారి పనులను పరిశీలిస్తున్న ఆళ్ల లీలావతి శ్రీనివాస్

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు



శ్రీనగర్ రోడ్డులో ప్రవహిస్తున్న మురుగునీరు

సీతంపేట: స్థానిక శ్రీనగర్ రోడ్‌లో 50–57–9/3 డోర్ నంబరు ఇంటి వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. దీంతో నాలుగు రోజులుగా మురుగునీరు రోడ్డెక్కి ప్రవహిస్తోంది. రోడ్ మొత్తం మురుగు విస్తరించడంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. పక్కనే ఉన్న వీటీ హైస్కూలకు వచ్చే విద్యార్థులు, తల్లిదండ్రులు మురుగు నీటిలో నడిచి వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

సీతమ్మధార: విశాఖ నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దర్ని ఫోర్త్ టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎస్.విజయకుమార్ తెలిపిన వివరాలు ఇలా..
అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో 24 కిలోల గంజాయిని తమిళనాడుకు చెందిన ప్రేమనిసార్, శిపురాజులు కొనుగోలు చేసి సోమవారం రాత్రి రెండు బ్యాగులతో విశాఖ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. సమాచారం తెలుసుకున్న ఫోర్తుటౌన్ పోలీసులు వారిని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. గంజాయి తేస్తే నగదు ఇస్తానని తమిళనాడుకు చెందిన రియాజ్ అనడంతో అరకు వచ్చి గొనుగోలు చేశామని నిందితులు వెల్లడించారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మురుగు సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి



వన్‌టౌన్ వద్ద సిల్ట్ చాంబర్‌ను శుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్



రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టు కొమ్మలను యార్డుకు తరలిస్తున్న పారిశుధ్య సిబ్బంది

జగదాంబ: వర్షాల నేపథ్యంలో డ్రెయిన్లు బ్లాక్ కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. మంగళవారం ఆయన టౌన్‌కొత్తరోడ్డు వద్ద ఉన్న భారీ సిల్ట్ చాంబర్‌ను పరిశీలించి శుభ్రం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు అన్ని ప్రాంతాల్లో సిల్ట్ చాంబర్లను శుభ్రపరచాలన్నారు. అదే విధంగా రామకృష్ణా జంక్షన్, రామకృష్ణా రైతు బజార్, పోర్టు వద్ద ఉన్న కెనాల్‌లో కూడా సిల్ట్ తీయాలన్నారు. ఇందుకు అవసరం అయితే జేసీబీలను ఉపయోగించాలన్నారు. అదే విధంగా వన్‌టౌన్ విస్తరణలో భాగంగా జరుగుతున్న పనులకు సంబంధించి చెత్త, మట్టి, సిమ్మెంట్ రద్దును కాంట్రాక్టర్లచే ఎప్పటికప్పుడు ఎత్తించాలన్నారు. మురుగు నీటి ప్రవాహం రహదారులపై పారకుండా సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

21న గురుపౌర్ణమి ఉత్సవాలకు ఏర్పాట్లు

మురళీనగర్: మురళీనగర్ రామాలయం ప్రాంగణంలోని షిర్డీసాయి ధ్యాన మందిరంలో ఈనెల 21వ తేదీన గురు పౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యదర్శి టి.నారాయణ రెడ్డి చెప్పారు. శైవాగమ పండితుడు అయిలూరి శ్రీనివాసదీక్షితుల పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు అయిలూరి రామశాస్త్రి ఆధ్వర్యంలో గురుపూజా మహోత్సవాలు నిర్వహిస్తారు. అయోధ్యంలో శ్రీరాముడి విగ్రహం ఏర్పాటు చేసిన సందర్భంగా ఈనెల 21న సాయంత్రం సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు.

రుషికొండ బీచ్‌లో కుక్కల బెడద

కొమ్మాది : ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో కుక్కల బెడద తీవ్రంగా వుంది. బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పొందిన ఈ బీచ్‌కు నిత్యం వేలాది మంది పర్యాటకులు దేశ విదేశాల నుంచి వస్తుంటారు. అయితే ప్రస్తుతం ఇక్కడకు వచ్చిన పర్యాటకులను పదుల సంఖ్యలో గుంపులు గుంపులుగా కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జీవీఎంసీ అధికారులు ఇక్కడి కుక్కలను పట్టుకున్నారు. అయితే వాటిని బీచ్‌కు కాస్త దూరంలో విడిచిపెట్టి మమ అనిపించారు. దీంతో అవి మరలా తీరానికి చేరుకున్నాయి. ప్రస్తుతం పర్యాటకులు ఇక్కడి బీచ్‌కు రావాలంటే ఆందోళన చెందుతున్నారు. బీచ్‌లో కుక్కలను కట్టడి చేయాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు.



రుషికొండ బీచ్‌లో పర్యాటకుల పక్కనే కుక్కలు

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

తగరపువలస : చదువులో వెనుకబడిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. మంగళవారం ఆమె భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ముందుగా 10వ తరగతి విద్యార్థుల గదిలో ప్రవేశించి బయాలజీ, గణితం, హిందీ, ఫిజిక్స్ నోట్స్‌లను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం 6, 7 తరగతులకు ఏక్టివిటీలు తయారు చేస్తున్న ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం, 'నాడు – నేడు' పథకం కింద నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.వి.టి.రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, ఎస్.విజయకుమార్, ఎ.హేమసుందరరావు, ఆర్.త్రివేణి, డీవీ సత్యవతి, అనురాధ, రాజేశ్వరి, రామస్వామి, రమేష్, సుశీల్‌కుమార్ తదితరులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.



చిప్పాడ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న భానుప్రకాష్

మురళీనగర్: పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత నిచ్చి ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మానవసేవే మాధవ సేవ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల భాను ప్రకాష్ చెప్పారు. ఆయన ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యుల సమావేశం శ్రీదేవి పార్కులో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి స్థానికులకు దత్తనివ్వడంతో పాటు పార్కుల్లో బ్యూటిఫికేషన్‌కు సంబంధించిన మొక్కలు దాతల ద్వారా అందిస్తామన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు నెల చివరి వారంలో అనాథాశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సెప్టెంబరులో నిర్వహించే వినాయక చవితికి మట్టి వినాయక విగ్రహాలు, వినాయక వ్రతకల్పం పుస్తకాలు పంపిణీ చేయాలని సభ్యులు నిర్ణయించారు. ఇందుకు రూ.20,000లు అవసరమవుతుందని అంచనా వేశారు. సంఘం ఉపాధ్యక్షుడు వరప్రసాద్ తన వంతుగా రూ.10,000లు విరాళంగా అందిస్తానని ప్రకటించారు. సెప్టెంబర్‌లో గౌరవ అధ్యక్షుడు ప్రసాదరాజు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించడానికి కమిటీ సభ్యులు ఆమోదం తెలియజేశారు.గురు పౌర్ణమి, సింహాచలం గిరి ప్రదక్షిణ సందర్భంగా కమిటీ సభ్యులు సతీష్ కుమార్, కుమార్, శ్రీనివాస్ సంయుక్తంగా నిర్వహించనున్న ప్రసాద వితరణ కార్యక్రమంలో సభ్యులు పాల్గొనాలని నిర్ణయించారు.

'హ్యాండ్లూమ్ సారీ వాక్ 'పై అవగాహన



గైస్‌లో 'హ్యాండ్లూమ్ సారీ వాక్ ' పోస్టర్ విడుదల

మురళీనగర్: స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ ఆధ్వర్యంలో 'హ్యాండ్లూమ్ సారీ వాక్' పై గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ కెమికల్ ఇంజినీరింగ్ (గైస్)లో విద్యార్థినులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కేవీ రమణతో కలిసి సభ్యులు 'హ్యాండ్లూమ్ సారీ వాక్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆర్కే బీచ్ విశ్వప్రియ ఫంక్షన్ హాల్‌లో ఆగస్టు 4న నిర్వహించనున్న త్రీ కే వాక్ కార్యక్రమానికి 7వేల మంది మహిళలు హాజరవుతారని స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో గైస్ విద్యార్థినులు పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎస్ రాజ్ కుమారి, పి శేఖర్, ఎ. శైలజ, డి.విజయ స్వాతి పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ అమ్మవారి పండగ



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న మహిళలు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24 వార్డు నక్కవానిపాలెంలోని శ్రీనూకలమ్మ అమ్మవారి పండగ అంగరంగ వైభవంగా జరిగింది. నక్కవానిపాలెం గ్రామ నూతన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 5 గంటల నుంచి భక్తులు పసుపు కుంకులతో పూజ లు నిర్వహించారు. సాయంత్రం7 గంటల నుంచి నక్కవానిపాలెం రామాలయం వీధి నుంచి అమ్మవారి గుడి వరకు మహిళలు ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు.వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు గుడ్ల కాటరాజురెడ్డి, సెక్రటరీ కారపు శ్యామలరావు, కోశాధికారి ధర్మాల గురుమూర్తి రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉద్యానవనాల సాగు లాభదాయకం



రైతుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు



సదస్సుకు హాజరైన దుకాణదారులు

విశాఖ విద్య : ఉద్యానవనాల సాగు ఎంతో లాభదాయకమని జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. మర్రిపాలెం రైతు బజారులో మంగళవారం ఉద్యానవనాల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇళ్ల వద్ద సాగు చేస్తూ, రైతు బజార్లలో విక్రయాలకు కూరగాయలు తీసుకొస్తున్న పలువురు రైతులతో మాట్లాడారు. సాగులో వారి అనుభవాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన వనాల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. తక్కువ విస్తీర్ణంలోనే రోజువారీ ఆదాయం సంపాదించేలా పంటలు పండించవచ్చన్నారు. విత్తనాల కొనుగోలు, ఎరువుల వాడకం గురించి పూర్తి స్థాయిలో తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ పరంగా అందించే సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాగునీటి సరఫరాకు రేపు అంతరాయం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ సీతమ్మధార టీపీటీ కాలనీలో 400 ఎంఎం వ్యాసం గల పంపింగ్ మెయిన్‌లైన్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఈ నెల 18న జోన్–3 పరిధి పలు ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాస్ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జోన్–3 పరిధి టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, నక్కవానిపాలెం, చైతన్యనగర్, క్రాంతినగర్, శారదా స్కూల్ ఏరియా, రామకృష్ణానగర్, లలితానగర్, శంకరమఠం మెయిన్‌రోడ్డు, చిన్నూరు, మంగలి వీధి ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడతుందని తెలిపారు. అత్యవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయనున్నట్లు శ్రీనివాస్ ప్రసాద్ పేర్కొన్నారు.

సొసైటీ సభ్యులకు న్యాయం చేయాలి

గోపాలపట్నం : నేవల్ ఆర్మమెంట్ డిపో సివిల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులకు భరోసా కల్పించాలని, సభ్యుల లోన్లు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ ఎన్ఏడీ ప్రధాన గేటు వద్ద నేవల్ ఆర్మమెంట్ సివిలియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ ఎన్ఏడీ సివిలియన్ కోఆపరేటివ్ సొసైటి పాలక వర్గం సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోయారు. సభ్యుల లోన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయకుండా తాత్సారం చేస్తుందని దుయ్యబట్టారు. పాలక మండలి తీరు భయాందోళనలకు గురి చేస్తోందన్నారు. గతంలో ఉన్న పాలక మండలి సలహా కమిటీ ఏర్పాటు చేసుకుని సభ్యులకు సకాలంలో లోన్లు మంజూరు చేసేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా కార్మికులకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన లోన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

తగరపువలస : దక్షిణ భారత హిందీ ప్రచారసభ సెప్టెంబరులో నిర్వహించే లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపు గడువును పెంచినట్టు భీమిలి ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. లోయర్ పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక పరీక్షలకు అపరాధ రుసుము లేకుండా ఈ నెల 31 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. హయ్యర్ పరీక్షలైన రాష్ట్ర భాష విశారద పూర్వార్థ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్థ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్థ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్థ పరీక్షలకు అపరాధ రుసుము లేకుండా ఈ నెల 25 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. ఉచిత శిక్షణ, మిగిలిన వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని సూచించారు.





